## క్లుప్తంగా

### స్వామిదాసుకు క్రైస్తవ సంఘాల మద్దతు



తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని క్రైస్తవ సంఘాలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసుకు మద్దతు తెలపాలని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు మాదాసు ఫిలిప్ కోరారు. మంగళవారం తిరువూరులో జరిగిన ఫెలోషిప్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 13న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో క్రైస్తవ కుటుంబాలన్నీ వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని, స్వామిదాసు గెలుపునకు కృషిచేయాలని సూచించారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల నుంచి ఫెలోషిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### వేణుగోపాలుని కల్యాణం



నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి మాస కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరువూరు గోపాలాచార్యులు, అర్చక బృందం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తం జరిపారు. ఐదుగురు దంపతులు పీటలపై కూర్చుని కన్యాదానం చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

### ఎన్ఆర్ఐ కళాశాలకు అవార్డు



ఆగిరిపల్లి: పోతవరప్పాడు ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలకు భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్సీ అవార్డు లభించడం ఆనందంగా ఉందని కళాశాల చైర్మన్ ఆర్. వెంకటరావు అన్నారు. రెండేళ్ల నుంచి 200లకు పైగా బహుళ జాతి సంస్థల్లో 1,500 మంది విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినందుకు బ్రైనోవిజన్, ఏఐసీటీఈ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐసీటీఇ కో–ఆర్డినేటర్ చేతుల మీదగా కళాశాల ప్రిన్సిపాల్ నాగ భాస్కర్ అవార్డు అందుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సాంబశివరావు, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సురేంద్ర, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

### టెన్త్ టాపర్ మనస్వికి పలువురి అభినందన



నూజివీడు/ముసునూరు: పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 600 మార్కులకు 599 సాధించి రికార్డు సృష్టించిన నూజివీడు పట్టణానికి చెందిన ఆకుల వెంకట నాగసాయి మనస్విని వైఎస్సార్ సీపీ నాయకులు, ఎమ్మెల్యే మేకా ప్రతాప్ తనయుడు చంటినాయన సోమవారం రాత్రి అభినందించారు. బాలిక ఇంటికి వెళ్లి ఆమెను సత్కరించి స్వీటు తినిపించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదిగాలని ఆకాంక్షించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే మనస్విని నూజివీడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బర్మా సీతారామయ్య, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, ఎంపీపీ కొండా దుర్గాభవాని, వెంకట్రావు దంపతుల ఆధ్వర్యంలో నియోజకవర్గ, ముసునూరు మండల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ రంగు ధనలక్ష్మి గాంధీ, ఉప సర్పంచ్ సత్యనారాయణ, నామముల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### సూపర్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం



ఇబ్రహీంపట్నం: ఆల్ఫా సూపర్ మార్కెట్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. మార్కెట్ ముందు భాగంలోని పిజ్జా కార్నర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి కరెంట్ వైర్లు ఇంటర్నల్‌గా కాలిపోయి శ్లాబ్ సీలింగ్‌కు నిప్పు అంటుకుంది. కాలిపోయిన సీలింగ్ ముక్కలు గదిలో పడటం ద్వారా షాపులో ఉన్న ప్లాస్టిక్, తదితర వస్తు సామగ్రి కాలిబూడిదయ్యాయి. భారీగా పొగలు అలుముకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు మూడు అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కోలాహలంగా మేకా ప్రతాప్ నామినేషన్

- వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు
- ద్వారకా ఎస్టేట్ నుంచి సబ్ కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ
- కిక్కిరిసిన రహదారులు
- మళ్లీ జగన్ ప్రభుత్వమే అంటూ కార్యకర్తల నినాదాలు



పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్ నుంచి సింగ్ హోటల్ సెంటర్ వరకు కార్యకర్తలతో కిక్కిరిసిన రోడ్లు (ఇన్‌సెట్) ద్వారకా ఎస్టేట్ నుంచి ప్రచారరథంపై వస్తున్న ప్రతాప్ అప్పారావు

నూజివీడు: నూజివీడు అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతాప్ తన స్వగృహం ద్వారకా ఎస్టేట్ నుంచి ర్యాలీగా బయలుదేరి సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నూజివీడు ఆర్డీఓ వై. భవానీశంకరికి ప్రతాప్ తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ప్రతాప్ వెంట ఏపీ స్టేట్ కో– ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు ఉన్నారు.

**జనసంద్రమైన నూజివీడు**

ఎమ్మెల్యే ప్రతాప్ నామినేషన్ కార్యక్రమం సందర్భంగా నూజివీడు పట్టణం జనసంద్రమైంది. ఎండను సైతం లెక్కచేయకుండా నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలతో నూజివీడు ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. వైఎస్ జగన్, మేకా ప్రతాప్ వర్ధిల్లాలి, రెండోసారి జగన్ సీఎం కావాలంటూ నాయకులు, కార్యకర్తలు చేసిన నినాదాలు మార్మోగాయి. తొలుత ప్రతాప్‌కు పాస్టర్లు, వేదపండితులతో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. అనంతరం ప్రతాప్ తన స్వగృహం ద్వారకా ఎస్టేట్ నుంచి చిన్నగాంధీ బొమ్మ సెంటర్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, పెద్దగాంధీ బొమ్మ సెంటర్, శ్రీనివాస సెంటర్ల మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యకర్తలు ప్రతాప్‌పై పూల వర్షం కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. దారి పొడవునా మహిళలు రోడ్డుకు ఇరువైపులా ఉండి ప్రతాప్‌కు ఘనస్వాగతం పలికారు. దారిపొడవునా నూజివీడుకు కృష్ణాజలాలు తీసుకువచ్చిన ప్రతాప్ జిందాబాద్.. అభినవ భగీరథుడు.. నూజివీడు అభివృద్ధి ప్రతాప్‌కే సాధ్యం.. ట్రిపుల్‌ఐటీ ఏర్పాటు, కేంద్రియ విద్యాలయం మంజూరు చేయించి నూజివీడుకు దేశంలోనే గుర్తింపు తెచ్చిన నేత ప్రతాప్ అంటూ పార్టీ శ్రేణులు నినదించాయి. ఊరేగింపును పోలీసులు పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద నిలిపివేయడంతో అక్కడి నుంచి ప్రతాప్ కాలినడకన సబ్ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య, ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, నూజివీడు పట్టణ, మండల, ముసునూరు, ఆగిరిపల్లి మండల అధ్యక్షులు శీలం రాము, పోలిమెట్ల శివ, మూల్పూరి నాగవల్లేశ్వరరావు, పలగాని నరసింహారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, జెడ్పీటీసీ సభ్యులు వరికూటి ప్రతాప్, పిన్నిబోయిన వీరబాబు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, నూజివీడు ఏఎంసీ చైర్‌పర్సన్ కంభాల కృష్ణవేణి, పలు మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, నియోజకవర్గ నలుమూలల నుంచి విచ్చేసిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వైఎస్ జగన్ మరోసారి సీఎం కావడం ఖాయం**

నామినేషన్లు వేసిన అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వెలుపల ప్రతాప్ విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన అన్నారు. ప్రజల హృదయాల్లో గూడు కట్టుకొని ఉన్న జగన్‌కు ఓటేసేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, అభివృద్ధి పరుగులు పెట్టాలన్నా వైఎస్సార్ సీపీని గెలిపించడం చారిత్రక అవసరమని స్పష్టం చేశారు. అవినీతికి, దోపిడీకి మారుపేరైన టీడీపీని కూకటివేళ్లతో పెకిలివేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 175 సీట్లకు 175 సాధించడం ఖాయమని, ఎంతమంది కలిసి వచ్చినా సింహంలాంటి జగన్‌ని ఏమీ చేయలేరని ప్రతాప్ అన్నారు. నామినేషన్ల కార్యక్రమానికి తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, సానుభూతిపరులు అందరికీ ప్రతాప్ అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు.

**భారీగా తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు..**

ముసునూరు/ఆగిరిపల్లి/చాట్రాయి: ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు నామినేషన్ కార్యక్రమానికి ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. పార్టీ ముసునూరు మండల నాయకులు నాగవల్లేశ్వరరావు, జి.రంగారావు, నూజివీడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కంబాల కృష్ణవేణి రాంబాబు, వైస్ చైర్మన్ బర్మా సీతారామయ్య, ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, మాజీ ఎంపీపీ కృష్ణకుమారి, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, పార్టీ జిల్లా యూత్ జాయింట్ సెక్రటరీ కోన రమేష్, కోరు అనిల్ తదితరులు తరలివెళ్లినవారిలో ఉన్నారు. అలాగే ఆగిరిపల్లి మండలం నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. సుమారు వెయ్యి ద్విచక్ర వాహనాలు, 150 కార్లు, 200 టాటా మ్యాజిక్‌లు, ఆటోల్లో ర్యాలీగా నూజివీడుకు తరలివెళ్లారు. చాట్రాయి మండలం నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలపై భారీగా తరలివెళ్లారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చెలికాని బాబ్జీ, దామెర ప్రసాద్‌బాబు, కారంగుల వాసు, వైస్ ఎంపీపీ పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్ మోహనరావు, మోరంపూడి నాగేశ్వరరావు, మాదల నరసింహారావు, పరసా చెన్నారావు తదితరులు తరలివెళ్లారు.



నామినేషన్ పత్రాలను ఆర్వో భవానీశంకరికి అందిస్తున్న మేకా ప్రతాప్ అప్పారావు



చింతలవల్లి నుంచి నూజివీడు తరలుతున్న పార్టీ శ్రేణులు



పార్టీ శ్రేణులు, అభిమానులతో కిక్కిరిసిన నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్

## తిరువూరు, మైలవరంలో ఐదు నామినేషన్లు



తిరువూరు బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న వందనకుమార్

తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు తరఫున ఆయన సతీమణి సుధారాణి నామినేషన్ దాఖలు చేశారు. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా లక్కెపోగు వందనకుమార్ రిటర్నింగ్ అధికారి మాధవికి రెండో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు.

**మైలవరంలో ..**

మైలవరం: మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను మంగళవారం నియోజకవర్గ ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి. సంపత్‌కుమార్‌కు అందజేశారు. జి.కొండూరు మండలం చెరువు మాధవరానికి చెందిన ఓర్సు రామారావు జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా, మైలవరం మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన నూనె సుధీర్‌కుమార్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా, విజయవాడ రూరల్ రాయనపాడు గ్రామానికి చెందిన చింతపల్లి దాస్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేశారు.

# సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పారదర్శక పాలనకు ప్రజల జేజేలు
- నిన్నటివరకు పొగిడిన నోటితోనే నేడు వసంత విమర్శలు
- వసంతకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్న ప్రజలు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు





సమావేశంలో మాట్లాడుతున్న సర్నాల తిరుపతిరావు

మైలవరం: అవినీతి లేని పారదర్శక ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం సీఎంఆర్ కల్యాణ మండపంలో పాలకుల భద్రత–పాలితుల బాధ్యత సమగ్ర విశ్లేషణ రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం అవర్ స్టేట్ అవర్ లీడర్ ఇండియన్ ఇంటలెక్చ్యువల్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగింది. తిరుపతిరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా గత ఐదేళ్లలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగాయని చెప్పారు. విద్య, వైద్యం, సామాజిక అభివృద్ధి జరిగాయని చెప్పారు. ఒక సామాన్యుడినైన తనకు అసెంబ్లీ సీటు కేటాయించడం జగనన్నకే సాధ్యమైందన్నారు. జగనన్న ఆశీస్సులతో ప్రజల్లో తిరిగి తనను అసెంబ్లీ అభ్యర్థిగా గెలిపించాలని కోరుతున్నానని, ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పథకాలే తిరిగి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువస్తాయని, పారదర్శక పాలనతో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా వసంత వెంకట కృష్ణప్రసాద్ నిన్నటి వరకు జగనన్నను పొగిడిన నోటితోనే ప్రస్తుతం పార్టీ మారి నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని చెప్పడాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ఓట్లతోనే మైలవరం ప్రజలు వసంతకు బుద్ధి చెబుతారన్నారు. మైలవరంలో వ్యవసాయానికి నీటిని సరఫరా చేసే పంట కాలువలు ఎన్ని ఉన్నాయో కూడా తెలియని వ్యక్తి వసంత కృష్ణప్రసాద్ అని విమర్శించారు. డబ్బు ఉందికదా అని ప్రజాప్రతినిధులను, నాయకులను కొనుగోలు చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడని, ఆయన ప్రయత్నాలను ప్రజలు తిప్పికొడుతున్నారని చెప్పారు. టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను ఓడించి ఇంటికి పంపేందుకు మైలవరం నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి, అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జె. గంగాధరరావు, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, జి.కొండూరు జెడ్పీటీసీ మందా జక్రధరరావు, ఎంపీపీ లక్ష్మీ తిరుపతమ్మ, జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి నిరంతరం కృషి

**నల్లగట్ల స్వామిదాసు**



విస్సన్నపేటలో ప్రచారం చేస్తున్న స్వామిదాసు

విస్సన్నపేట: పేదల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. విస్సన్నపేట సత్తుపల్లి రోడ్డులో, ఆర్యవైశ్య కల్యాణ మండపం ఏరియాలో, ఎన్‌టీఆర్ కాలనీ, బీసీ కాలనీలలో గడప గడపకు ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. స్వామిదాసుకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. స్వామిదాసు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, అభివృద్ధి జరగాలన్నా జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. ప్రజలంతా ఎంపీగా కేశినేని నానికి, ఎమ్మెల్యేగా తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, పలు విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నివర్గాలకు మేలు చేసిన సీఎం జగన్

**సర్నాల తిరుపతిరావు**



ఓబులాపురంలో తిరుపతిరావుకు హారతి పడుతున్న మహిళలు

రెడ్డిగూడెం: ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని, జగనన్నకు ప్రజలు మరోసారి అండగా నిలిచి ఆదరించాలని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మండలంలోని నరుకుళ్లపాడు, ఓబులాపురం గ్రామాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు.

మే 13న జరుగనున్న ఎన్నికల్లో ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్యేగా తనను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మైలవరం ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ బలగాని తిరుపతిరావు, ఓబులాపురం సర్పంచ్ నూనె అప్పిరెడ్డి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్స్, బాబురెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

## మహిళలకు కుట్టుమిషన్ల అందజేత

ఆగిరిపల్లి: అడవినెక్కలం గ్రామంలో సుదీక్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 30 మంది మహిళలకు ఐసీడీఎస్ సీడీపీఓ నూరాణి కుట్టుమిషన్లను అందజేశారు. సుదీక్షన్ ఫౌండేషన్ నిర్వాహకురాలు చిగురుపాటి విమల మాట్లాడుతూ నాలుగు నెలలుగా ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి 50 శాతం రాయితీతో కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను అందజేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 120 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశామని వివరించారు.

## నేడు తిరుపతిరావు ఎన్నికల ప్రచారం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కొండపల్లిలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ కొండపల్లి పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య మంగళవారం తెలిపారు. స్థానిక శాంతినగర్‌లో జరిగే ప్రచార కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

## విద్యార్థినులకు సన్మానం





కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పదో తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. పాఠశాల ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు సాధించిన బాలికలను మంగళవారం శాలువాతో సత్కరించారు. బండారు ఉషారాణి 577 ప్రథమస్థానం, షేక్ షఫీనా 577 ద్వితీయస్థానం, జి. అలేఖ్య 558 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. వీరు ప్రభుత్వ పాఠశాల స్థాయిలో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని పాఠశాల హెచ్‌ఎం బి.పద్మలత తెలిపారు. ఈ సందర్భంగా బాలికలను అభినందించారు. ఎస్ఎంసీ చైర్మన్ ఎన్.పుష్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• ఎ.కొండూరు: మండలంలోని పోలిశెట్టిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 91 శాతం ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో పాఠశాల నిలిచిందని ప్రధానోపాధ్యాయులు ఎ. రవికుమార్ మంగళవారం తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులు కె. సాహిత 525, జాహ్నవి 506, కె. ఉమాంజలి 506ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జి. రామయ్య, బి. సూర్య, జి. ఇందిరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైభవంగా ఎదుర్కోలోత్సవం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం సుప్రభాతసేవ, పుష్పాలతో అలంకరణ, నిత్యహోమం, బలిహరణ, ఎదుర్కోలోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పరాంకుశం వాసుదేవాచార్యుల పర్యవేక్షణలో ఆయా పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

## ఉపాధ్యాయిని అరుణకుమారి సేవలు ప్రశంసనీయం

మైలవరం: వెల్వడం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోషల్ ఉపాధ్యాయిని జి. అరుణకుమారి సేవలు ప్రశంసనీయమని ఎస్టీయూ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ ఎం. బసవయ్య అన్నారు. వెల్వడం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయిని అరుణకుమారి పదవీ విరమణ కార్యక్రమం మంగళవారం జరిగింది. నాలుగు దశాబ్దాలుగా ఉపాధ్యాయినిగా అంకిత భావంతో పనిచేసి, ఎందరో విద్యార్థులను ఉన్నత స్థితికి చేర్చడానికి ఆమె ఎంతో కృషి చేశారని పలువురు కొనియాడారు. ఎస్టీయూ ఏపీ జిల్లా కార్యదర్శి కె. ప్రభుకుమార్ మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని, మండల ఉత్తమ ఉపాధ్యాయినిగా అరుణకుమారి అవార్డులు అందుకున్నారని అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సాయికుమారి, సిబ్బంది అరుణకుమారిని సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షురాలు ఇందిర, కార్యదర్శి పి. రవిబాబు, ఎ. కొండూరు మండల అధ్యక్షుడు ఎన్. జార్జి వాషింగ్‌టన్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దీపోత్సవం



గంపలగూడెం: గంపలగూడెం షిర్డీ సాయి ధ్యాన నిలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం రాత్రి నందా దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి మహిళలు నందా దీపాలను చేబూని వెంట రాగా మందిరం చుట్టూ 11 ప్రదక్షిణలు చేశారు. భక్తులు పాల్గొన్నారు.